సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 18 । జూన్ । 2025



పఠనాసక్తి పెంచేలా..
విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి దిన పత్రికలు, మేగజిన్‌ల కొనుగోలుకు కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యాయి. - 8లో



డూప్లికేట్ చేస్తే కేసులు..
ఇక్కత్ డిజైన్లను డూప్లికేట్ చేసినా, ప్రింటింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి హెచ్చరించారు. - 8లో



చురుగ్గా ఇళ్ల నిర్మాణం
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పైలట్ గ్రామాల్లో చురుగ్గా సాగుతున్నాయి. - 9లో

న్యూస్‌రీల్

19న ప్రధానాలయాల ఉద్యోగుల సమావేశం

యాదగిరిగుట్ట: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల ఉద్యోగుల సమావేశం ఈనెల 19వ తేదీన యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించనున్నట్లు దేవాలయ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు గజివెల్లి రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి, బాసర ఆలయాల్లో పనిచేస్తున్న మతపర, మినిస్టీరియల్, నాల్గో తరగతి సిబ్బంది సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని పాత గోశాలలో గల ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. టీఎన్‌టీఓల సెంట్రల్ యూనియన్, రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆంజనేయుడికి నాగవల్లి దళార్చన



ఆంజనేయస్వామికి పూజ చేసి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న ఆంజనేయస్వామికి నాగవల్లి దళార్చన శాస్త్రోక్తంగా చేపట్టారు. మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయం, విష్ణు పుష్కరిణి, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహాలను సింధూరంతో అలంకరించి, పాలాభిషేకం, తమలపాకులతో అర్చన చేశారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ప్రధానాలయంలోనూ సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర సేవలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

భువనగిరిటౌన్ : ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ హాకీ జట్టు తరఫున రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన ఆలేరు విద్యార్థులను కలెక్టర్ హనుమంతరావు మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర జట్టులోనూ చోటు సంపాదించాలని వారికి సూచించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థుల్లో గడ్డం సందీప్, బీరు సాయిగణేష్, రాజబోయిన మణికంఠ, శనిగరం పార్థసారథి, కె.వెంకటేష్ ఉన్నారు. వీరు ఇటీవల అదిలాబాద్‌లో జరిగిన సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయనేయులు పాల్గొన్నారు.

19న వాసాలమర్రికి మంత్రి పొంగులేటి రాక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

తుర్కపల్లి: రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 19న తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి రానున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో 227 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ దేశ్యానాయక్, కొక్కండ సత్తయ్య, పలుగుల లింగయ్య, బాబు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



మక్తా అనంతారం శివారులోని బునాదిగాని కాల్వ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పరిహారం చెల్లించాలి

బీబీనగర్: పరిహారం చెల్లించిన తర్వాతే బునాదిగాని కాల్వ విస్తరణ పనులు చేపట్టాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. బునాదిగాని కాల్వ ఆధునీకరణ పనుల్లో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు మంగళవారం బీబీనగర్ మండలం మక్తా అనంతారంలో కాల్వ వద్ద ఆందోళన చేశారు. తమతో చర్చలు జరపకుండానే తమ సాగు భూముల నుంచి కాల్వ విస్తరణ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ప్రణాళిక లేకుండా తూముల నిర్మాణం చేస్తున్నారని, దీంతో నీటి ప్రవాహం పెరిగినప్పుడు తూము గేట్ తెరిస్తే పొలాలు మునిగే అవకాశం ఉందన్నారు. రైతుల అభిప్రాయం మేరకు పనులు చేయాలని, లేకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

కొనుగోళ్లలో రాణించారు

ధాన్యం సేకరణ ద్వారా మహిళా సంఘాలకు భారీగా కమీషన్

- యాసంగి సీజన్‌లో 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రూ.3.44 కోట్లు కమీషన్‌గా ఆర్జించిన స్వయం సహాయక సంఘాలు
- కొనుగోలు కేంద్రాల్లో 30 శాతం వారివే..
- వానాకాలం నుంచి 50 శాతానికి పెంపు



కొనుగోలు కేంద్రంలో స్వయం సహాయక సంఘం సభ్యులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ (ఫైల్)

సాక్షి,యాదాద్రి: ధాన్యం కొనుగోలులో మహిళలు శభాష్ అనిపించుకున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక మహిళా సంఘాలు కీలకపాత్ర పోషిస్తూ రూ.కోట్లలో వ్యాపారం చేశాయి. యాసంగి సీజన్‌లో తమకు కేటాయించిన ఐకేపీ కేంద్రాల ద్వారా 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ.3.44 కోట్లు కమీషన్ రూపంలో ఆర్జించాయి. ఇందిరా మహిళా శక్తి పథకాల ద్వారా అతివల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం.. ధాన్యం సేకరణలోనూ వారికి అవకాశం కల్పించడంతో సత్తా చాటారు.

కొనుగోలు చేసిన ధాన్యం ఇలా..

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 321 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 91 కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిని స్వయం సహాయక సంఘాలకు కేటాయించారు. వీటి ద్వారా 1,77,228 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకు గాను క్వింటాకు రూ.32 చొప్పున ప్రభుత్వం కమీషన్ చెల్లించింది. మొత్తం రూ.3.44 కోట్లు మహిళా సంఘాల ఖాతాల్లో జమకానున్నాయి. కమిషన్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఇతర ఖర్చులు పోను 50 శాతం డబ్బులు స్త్రీనిధి ఖాతాలో జమ చేస్తారు.

ఇకనుంచి 50 శాతం కేంద్రాలు..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు 50 శాతం కేటాయించాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. యాసంగి ధాన్యం కొనుగోలుకు 321 కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 30 శాతం అంటే 91సెంటర్లు ఐకేపీకి కేటాయించారు. ప్రస్తుత వానాకాలం 50 శాతం కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో 20 శాతం కేంద్రాలను మాత్రమే కేటాయించేవారు. ఇదిలా ఉండగా యాసంగి సీజన్‌లో గోకారం, కక్కిరేణి, వెల్లంకి, శోభనాద్రిపురం, శివారెడ్డిగూడెం, పెద్ద గూడెంలోని కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధాన్యం సేకరించారు.

డిపాజిట్‌లలో నంబర్ వన్



ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాల పనితీరు ప్రశంసనీయం. వారికిచ్చిన లక్ష్యాన్ని 45 రోజుల్లోనే పూర్తి చేశారు. ఒక్క యాసంగి సీజన్‌లోనే కమిషన్ రూపంలో రూ.3.44 కోట్లు సంపాదించారు. ప్రస్తుతం జిల్లా స్త్రీనిధి బ్యాంకులో ఐకేపీ కేంద్రాల డిపాజిట్‌లు రూ.12 కోట్లు ఉన్నాయి. ఇది రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానం. ఈ వానాకాలం నుంచి మొత్తం కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం మహిళా సంఘాలకే కేటాయిస్తాం.
– నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

శిక్షణ సద్వినియోగం

ధాన్యం సేకరణకు తీసుకోవాల్సిన చర్యలపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. డేటా ఎంట్రీ, తేమ శాతం చూడటం, బుక్ కీపింగ్, కాంటా వేసిన నంబర్లకు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ పీడీ, ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు తమకు కేటాయించిన కేంద్రాల్లో విజయవంతంగా కొనుగోళ్లు పూర్తి చేసి భారీ కమీషన్ ఆర్జించారు.

బ్యాంకుల వద్ద బారులు



రైతుభరోసా డబ్బుల కోసం వచ్చిన రైతులతో కిక్కిరిసిన భువనగిరిలోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్

కర్షకుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ

- రెండు రోజుల్లో రూ.72.62 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకుల్లో అన్నదాతల క్యూ

భువనగిరిటౌన్ : జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకులు మంగళవారం రద్దీగా మారాయి. ప్రభుత్వం ఈ నెల 16 సాయంత్రం నుంచి రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ చేస్తోంది. డబ్బులు డ్రా చేసుకునేందుకు రైతులు పెద్ద సంఖ్యలో బ్యాంకుల బాట పట్టారు. జిల్లాలో 2,84,250 మంది రైతులకు రూ.317.57 కోట్లు పంట పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. వీరందరి ఖాతాల్లో తొమ్మిది రోజుల్లో నగదు జమచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎకరానికి రూ.6వేల చొప్పున మూడు ఎకరాల వరకు 1,33,736 మంది రైతుల ఖాతాల్లో రూ.72.62 కోట్లు జమయ్యాయి.

బ్యాంకర్ల తీరుతో రైతుల అవస్థలు

బ్యాంకర్ల తీరుతో రైతుభరోసా డబ్బులు డ్రా చేసుకోవడానికి ఇబ్బందులు పడినట్లు పలువురు రైతులు వాపోయారు. రైతుభరోసా సాయాన్ని ఇతర రుణాలకు లింక్‌పెట్టవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ, కొన్ని బ్యాంకులు అవేమీ పట్టించుకోకపోవడం రైతులు సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వచ్చింది. విత్‌డ్రా ఓచర్లు ఇవ్వలేదని, అధికారులు సరైన సమాధానం చెప్పలేదని భువనగిరిలోని యూనియన్ బ్యాంకుకు వచ్చిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ఓచర్ నింపుతున్న రైతు

ఇబ్బందులకు గురిచేస్తున్నారు



రైతుభరోసా డబ్బులు తీసుకోవడానికి భువనగిరిలోని యూనియన్ బ్యాంకుకు వెళ్లాను. పైసలు తీసుకునేందుకు ఓచర్ అడగగా అధికారులు కాలయాపన చేశారు. సాయంత్రం వరకు వేచి చూడాల్సి వచ్చింది. నాలాంటి పరిస్థితినే చాలా మంది రైతులు ఎదుర్కొన్నారు.
– మచ్చ భాస్కర్, రైతు

ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, వేదికపై డీఎంహెచ్‌ఓ, జెడ్పీ సీఈఓ

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

సాక్షి,యాదాద్రి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా నివారణ చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వీధుల్లో పిచ్చిమొక్కలను తొలగించాలని, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని సూచించారు. వసతి గృహాల్లో నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసి శుభ్రపరచాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే- డ్రై డే గా పాటించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, అవసరమైన చోట ఆయిల్ బాల్స్ వేయాలని, నీటి పైపులైన్లకు మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ సునంద, డీఎంహెచ్ మనోహర్, మిషన్ భగీరథ ఎస్ఈ కరుణాకర్, ఎస్సీ సంక్షేమ అధికారి జినుకల శ్యాంసుందర్ మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందుండాలి

అభివృద్ధిలో గ్రామాలను జాతీయస్థాయిలో ముందుంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. పల్లెల అభివృద్ధికి తీసుకోవాలిన చర్యలపై మండల పరిషత్, పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. అభివృద్ధికి సంబంధించి తొమ్మిది అంశాలపై వారికి అవగాహన కల్పించారు. వీటిని పక్కాగా అమలు చేస్తే గ్రామాలు అలవోకగా అభివృద్ధి చెందుతాయన్నారు.

సిటీ స్కాన్ సేవలెప్పుడు?

- నిరుపయోగంగా రూ.2.5 కోట్ల యంత్రం
- జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెండు నెలల క్రితమే చేరిక
- వినియోగంలోకి తేవడంలో జాప్యం
- ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న రోగులు



భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల టీ హబ్ గదిలో ప్యాకింగ్ చేసి ఉన్న సిటీ స్కాన్ మిషన్

భువనగిరి: జిల్లా కేంద్ర ఆస్పత్రికి నిత్యం 500కుపైగా రోగులు వస్తుంటారు. 100 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రిలో అనేక విభాగాల్లో ఇన్‌పేషెంట్‌లకు నిత్యం సేవలందిస్తున్నారు. న్యూరాలజీ, మోకాల నొప్పులు, తల, ఎముకలు, శ్వాసకోశ సమస్యలు, గుండె సంబంధిత తదితర వ్యాధులకు సంబంధించి సిటీ స్కాన్ పరీక్షలు తప్పనిసరి అవుతున్నాయి. ఆస్పత్రికి రెండు నెలల క్రితం నూతనంగా సీటీ స్కాన్ మిషన్ మంజూరైనా సేవలు అందుబాటులోకి రావడం లేదు. ఫలితంగా స్కానింగ్ అవసరమైన రోగులకు ప్రైవేట్ ల్యాబ్‌లే దిక్కవుతున్నాయి.

రూ.2.5 కోట్లతో యంత్రం కొనుగోలు

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టినా జెడ్ భువనగిరిలోని జిల్లా ఆస్పత్రి సందర్శనకు వచ్చిన సమయంలో ఆస్పత్రికి సిటీ స్కాన్ అవసరమని గుర్తించారు. ఆమె ఆదేశాల మేరకు ఆస్పత్రి వైద్యులు ప్రతిపాదనలు రూపొందించి వైద్యారోగ్య శాఖకు పంపగా.. సిటీ స్కాన్ యంత్రాన్ని మంజూరు చేసింది. ఈ యంత్రం రెండు నెలల క్రితమే ఆస్పత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు చేరినా వినియోగంలోకి తేవడం లేదు. దీని విలువ రూ.2.5 కోట్ల వరకు ఉంటుంది.

నెలలు గడుస్తున్నా మంజూరుకాని విద్యుత్ కనెక్షన్

ప్రస్తుతం ఆస్పత్రికి విద్యుత్ సరఫరా జరుగుతున్న లైన్ సామర్థ్యం సిటీ స్కాన్ యూనిట్ నిర్వహణకు సరిపోదు.హై టెన్షన్ విద్యుత్ కనెక్షన్ కోసం వైద్యాధికారులు ట్రాన్స్‌కోకు దరఖాస్తు చేశారు. దీనికోసం సుమారు రూ.11 లక్షల వరకు అంచనా వ్యయంతో ప్రతిపాదించారు. రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు చలాన్ కట్టకపోవడంతో అనుమతి రాలేదని తెలుస్తోంది.

టెక్నీషియన్ల నియామకానికి ప్రతిపాదనలు

సిటీ స్కాన్ నిర్వహణకు రేడియాలజిస్ట్ అందుబాటులో ఉండగా ఇంకా నలుగురు టెక్నీషియన్లు కావాలి. వీరి నియామకానికి వైద్యాధికారులు ప్రతిపాదనలు పంపారు.

ప్రైవేట్ ల్యాబ్‌లే దిక్కు..

- భువనగిరి పట్టణానికి చెందిన ఓ మహిళ తలకు సంబంధిత సమస్యలతో ఆస్పత్రిలో చేరింది. సిటీ స్కాన్ తీయాలని వైద్యులు సూచించడంతో ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లింది. రూ.5వేల వరకు ఖర్చు వచ్చినట్లు బాధితురాలు వాపోయింది.
- ఆలేరుకు చెందిన ఓ వ్యక్తి కిడ్నీ సంబంధిత సమస్యలతో ఆస్పత్రికి వచ్చారు. వ్యాధి నిర్ధారణ కోసం ప్రైవేట్ ల్యాబ్‌లో సిటీ స్కాన్ తీయించుకోగా రూ.4వేల వరకు తీసుకున్నారని వాపోయాడు. ప్రైవేట్‌లో సీటీ స్కాన్ కోసం వేలాది రూపాయలు చెల్లించాల్సి రావడం పేద రోగులకు భారంగా మారింది. ఆస్పత్రిలో సిటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వస్తే రోగులకు బాధలు తప్పనున్నాయి.

విద్యుత్ కనెక్షన్ అనుమతి రాలేదు

సీటీ స్కాన్ యూనిట్ నిర్వహణకు గాను హైటెన్షన్ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేశారు. అనుమతి రాగానే సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. అదే విధంగా ప్రత్యేకంగా నలుగురు టెక్నీషియన్లు అవసరం ఉండగా సబంధిత శాఖకు ప్రతిపాదనలు పంపాం.
–వెంకటేశ్వర్లు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- డీఈఓ సత్యనారాయణ



ఆరెగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈఓ

చౌటుప్పల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ సత్యనారాయణ అన్నారు. చౌటుప్పల్ మండలం ఆరెగూడెంలోని జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, డిజిటల్ క్లాస్, పాఠశాల ఆవరణను పరిశీలించారు. బోధన తీరుపై ఆరా తీశారు. అడ్మిషన్లు ఎలా ఉన్నాయని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సులువైన రీతిలో పాఠాలు అర్థమయ్యేలా బోధనం చేయాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. ప్రాథమిక దశలోనే లక్ష్యాలను ఎంచుకుని పట్టుదలతో చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నల్లెంకి శంకరయ్య, ఉపాధ్యాయులు శ్వేత, విజయ్‌ప్రతాప్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



పహిల్వాన్‌పురంలో జరిగిన సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వలిగొండ : భూ భారతి చట్టంతో భూసమస్యల పరిష్కారానికే సత్వర పరిష్కారం లభించనుందని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పురం, వేములకొండ గ్రామాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించారు. పహిల్వాన్‌పురం సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త చట్టం ద్వారా భూముల లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్, ఆర్ఓఆర్ వంటి సేవలు సులభంగా పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన అనంతరం దరఖాస్తులను పరిశీ లించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. పహిల్వాన్‌పురంలో 41, వేములకొండలో 23 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ, డిప్యూటీ తహసీల్దార్ పల్లవి, రెవెన్యూ అధికారులు మనోహర్, కర్ణాకర్‌రెడ్డి, నగేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ. 8.47 కోట్లు విడుదల

భువనగిరి : 2025–26 సంవత్సరానికి గాను వివిధ అభివృద్ధి పనుల కోసం యాదాద్రి జిల్లాకు ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్రం ప్రభుత్వం రూ.8.47 కోట్లు విడుదల చేసిందని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ నేషనల్, రూరల్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ స్కీం కింద 63 పనులకు నిధులను విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో ఆలేరు, తుంగతుర్తి, మునుగోడు నియోజకవర్గాల్లో రూ.2కోట్లతో పది పంచాయతీ రాజ్ భవనాలు, రూ.3.12 కోట్లతో 26 అంగన్‌వాడీ కేంద్రాలు,రూ.3.35 కోట్లతో 27 స్కూళ్లకు ప్రహరీలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : సివిల్ సర్వీసెస్ పరీక్షలు–2025 కోసం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఇచ్చే శిక్షణకు ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులనుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సూర్యాపేట జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 6281766534 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తరలించకపోతే ముప్పే..



రామన్నపేట మండలం వెల్లంకి సబ్‌స్టేషన్ నుంచి పదిహేనేళ్ల క్రితం సిరిపురం శివారులో ఏర్పాటు చేసిన క్రషర్‌కు విద్యుత్ లైన్ వేశారు. లైన్ కోసం వెల్లంకి గ్రామంలోని ఈదుల చెరువులో స్తంభాలు పాతారు. అప్పట్లో చెరువులో నీళ్లు లేకపోవడం వల్ల ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. కొన్నేళ్లుగా పిల్లాయిపల్లి కాలువ నీటితో చెరువు ఎప్పుడూ నిండుగా ఉంటుంది. స్తంభాల్లో కొన్ని వంగిపోయాయి. మరమ్మతులు ఏర్పడినప్పుడు విద్యుత్ సిబ్బంది బోటు సాయంతో వెళ్లి సరి చేయాల్సి వస్తుంది. పశువులు నీళ్లు తాగే సమయంలో, గ్రామస్తులు చేపలు పట్టే సమయంలో ప్రాణాపాయం సంభవించే ప్రమాదం లేకపోలేదు. విద్యుత్ స్తంభాలను సురక్షితమైన ప్రాంతం నుంచి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. – రామన్నపేట

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మునగాల: ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ప్రమాదానికి గురై యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి మునగాల మండలం ఆకుపాముల శివారులో జరిగింది. ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం కొమరబండ గ్రామానికి చెందిన షేక్ దావూద్ కుమారుడు షేక్ ఇమామ్(20) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి వరంగల్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం ఆకుపాముల శివారులో మాంటిస్సోరి పాఠశాల ఎదుట బైక్ అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇమామ్‌కు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి షేక్ దావూద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు..

తుర్కపల్లి: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో లారీ ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తుర్కపల్లి మండలం మాదాపూర్ వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఓవర్‌టేక్ చేసే క్రమంలో తుర్కపల్లి నుంచి వస్తున్న ట్రాలీ ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొమ్మలరామారం మండలం గోవింద్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన ఆటో డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కాశయ్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి మండలంలోని నెల్లికల్లు గ్రామానికి చెందిన బైరు కాశయ్య గత నెల 21వ తేదీ నుంచి కనిపించడం లేదని అతడి భార్య గీత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యాదయ్య తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: కుక్కల దాడిలో చిన్నారికి గాయలైన ఘటన మంగళవారం సాయంత్రం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని మహమ్మాయికాలనీలో చోటుచేసుకుంది. మహమ్మాయికాలనీకి చెందిన మనస్విక మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్తుండగా.. వీధి కుక్కలు ఆమెపై దాడి చేసి కాలును కరిచాయి. చిన్నారి భయంతో కేకలు వేస్తుండగా తల్లి జ్యోతి బయటికి వచ్చి కుక్కలను బెదిరించే క్రమంలో ఆమెపై కూడా దాడికి యత్నించాయి. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి కర్రతో కుక్కలను తరమగా అవి అక్కడ నుంచి పారిపోయాయి. కుక్కల దాడిలో గాయపడిన చిన్నారిని వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేలా..

- 'పీఎంశ్రీ' పాఠశాలల్లో దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌లు కొనుగోలు చేసేందుకు నిధులు విడుదల
- ఉమ్మడి జిల్లాలోని 99 స్కూళ్లకు రూ.9.90లక్షలు కేటాయించిన కేంద్రం



ఆలేరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ప్రతిభకు మరింత పదును పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం, సమకాలీన అంశాలపై అవగాహన పెంచడం కోసం దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌ల కొనుగోలుకు చేసేందుకు కేంద్రం తొలిసారి నిధులు మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సరానికి గాను రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ ద్వారా డీఈఓలకు నిధులు విడుదల చేసింది. పీఎంశ్రీ కింద ఎంపికైన ఒక్కో స్కూల్‌లో దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌ల కొనుగోలుకు రూ.10వేల చొప్పున కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 99 పీఎంశ్రీ పాఠశాలలకు ఈ మేరకు నిధులు మంజూరయ్యాయి.

జిల్లాల వారీగా నిధులు ఇలా..

యాదాద్రి భువనగిరి జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 25 ప్రభుత్వ పాఠశాలలకు రూ.2.50లక్షలు, సూర్యాపేట జిల్లాలో 31 పాఠశాలలకు రూ.3.10లక్షలు, నల్లగొండ జిల్లాలోని 43 పాఠశాలలకు రూ.4.30లక్షల చొప్పున మొత్తం రూ.9.90లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఒక్కో పాఠశాలలో నెలకు రూ.1000 చొప్పున పది నెలల పాటు దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

పత్రికల కొనుగోలు ఇలా ఉండాలి..

ప్రతి పాఠశాలలో ఒక తెలుగు దినపత్రిక, ఒక హిందీ లేదా ఉర్దూ దినపత్రిక, ఒక ఇంగ్లిష్ దినపత్రిక కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒక చిన్నపిల్లల తెలుగు మ్యాగజైన్, ఒక హిందీ లేదా ఉర్దూ చిన్నపిల్లల మ్యాగజైన్, ఒక ఇంగ్లిష్ చిన్నపిల్లల మ్యాగజైన్ కొనుగోలు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి.

ఈ నిధులు పది నెలలకే..



పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలల్లో దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌ల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. ఒక్కో స్కూల్‌కు రూ.10వేలు జమవుతాయి. ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వం సూచించిన ప్రకారం దినపత్రికలు, మ్యాగజైన్‌లు కొనుగోలు చేయాలి. నెలకు రూ.1000 చొప్పున పది నెలలకే బడ్జెట్ అలాట్ అయ్యింది. విద్యార్థుల్లో పఠనాసక్తితో పాటు కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించేందుకు ఆస్కారం ఉంటుంది.

– సత్యనారాయణ, డీఈఓ, యాదాద్రి భువనగిరి జిల్లా

ఇక్కత్ డిజైన్లను డూప్లికేట్ చేస్తే కేసులు నమోదు

- హ్యాండ్లూమ్స్ రీజినల్ డెవలప్‌మెంట్ కమిషనర్ మంజునాథ్


మాట్లాడుతున్న హ్యాండ్లూమ్స్ రీజినల్ డెవలప్‌మెంట్ కమిషనర్ మంజునాథ్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ డిజైన్లను డూప్లికేట్ చేసినా, ప్రింటింగ్ చేసినా, బ్లాక్ పెయింటింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హ్యాండ్లూమ్స్ రీజినల్ డెవలప్‌మెంట్ కమిషనర్ మంజునాథ్ అన్నారు. మంగళవారం పోచంపల్లి పట్టణంలోని చేనేత సహకార సంఘంలో చేనేత వస్త్రాల రిజర్వేషన్ యాక్ట్ పరిరక్షణపై చేనేత కార్మికులు, వివిధ చేనేత సంఘాల నాయకులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 11 రకాల చేనేత వస్త్రాలకు రిజర్వేషన్ యాక్ట్ కల్పించిందని అన్నారు. ఇందులో చీరలు, దోవతులు, టవల్స్, దుప్పట్లు, బెడ్‌షీట్స్ తదితర వస్త్రాలు ఉన్నాయని వివరించారు. రిజర్వేషన్ యాక్ట్ కల్పించిన వస్త్రాలను కేవలం మగ్గాలపై తయారు చేయాలని అన్నారు. అలాకాకుండా పవర్‌లూమ్స్‌పై తయారుచేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొంటామన్నారు. అంతేకాక పేటెంట్ హక్కు(జీఐ) కల్గిన వస్త్రాలను వంద కిలోమీటర్ల పరిధిలోనే తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో తయారు చేసినా చట్టరీత్యా నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు. వస్త్ర వ్యాపారులు, కార్మికులు తమ వస్త్రోత్పత్తులకు సిల్క్‌మార్క్, హ్యాండ్లూమ్ మార్కు లోగోలు తప్పనిసరి వేయించుకోవాలన్నారు. వినియోగదారులు కూడా సిల్క్‌మార్క్, హ్యాండ్లూమ్ మార్క్ లోగోలను చూసి వస్త్రాలను కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర చేనేత జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేనేత అభయహస్తం కింద నకిలీ వస్త్రాలను నిరోధించేందుకు నాణ్యమైన చేనేత వస్త్రాలను ప్రోత్సహించడానికి హ్యాండ్లూమ్ లోగోను అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ లీగల్ అసిస్టెంట్ దీపక్ వంశీ, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు, డీఓ రాజేశ్వర్‌రెడ్డి, టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, మాజీ అధ్యక్షుడు తడక రమేష్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేష్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, చేనేత నాయకులు చిక్క కృష్ణ, గంజి బస్వలింగం, భారత్ భూషణ్, గంజి కృష్ణ, దుద్యాల పాపయ్య, బోడ దయానందం తదితరులు పాల్గొన్నారు.

చింతపండు దొంగతనంపై విచారణ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాద విక్రయశాల గోదాంలో నుంచి గత నెల చింతపండు దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేసేందుకు గాను మొదట దేవాదాయశాఖ కమిషనర్‌గా ఉన్న ఆలయ ఈఓ వెంకట్రావ్ ఇదే దేవాలయానికి చెందిన డిప్యూటీ డీఈఓ పాటు మరో నలుగురు సభ్యులను నియమించారు. వారి నుంచి సరైన వివరాలు రాకపోవడంతో ఈఓ వెంకట్రావ్ ఇటీవలనే దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ రావుతో పాటు రీజినల్ జాయింట్ కమిషనర్, రంగారెడ్డి, నల్లగొండ, సికింద్రాబాద్ జిల్లాలకు చెందిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్లతో హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయానికి వచ్చిన హైలెవల్ కమిటీ సభ్యులు మంగళవారం సైతం లడ్డూ ప్రసాదం కౌంటర్ వద్ద, ప్రసాద గోదాంలో విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తూనే, అనుమానం ఉన్న వ్యక్తులను విచారించారు. ఉదయం నుంచి రాత్రి వరకు విచారణ జరిగింది. విచారణ సమయంలో స్థానిక అధికారులు, ఉద్యోగులను ఎవరిని హైలెవల్ కమిటీ అధికారులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చింతపండు దొంగతనమేనా లేక గతంలో ఏమైనా దొంగతనాలు జరిగినాయా అనే అంశాలపై క్షుణ్ణంగా విచారణ చేస్తున్నారు. విచారణ పూర్తి అయిన అనంతరం ఈఓ వెంకట్రావ్‌కు విచారణ కాపీలను హైలెవల్ కమిటీ సభ్యులు ఇవ్వనున్నారు.

టిప్పర్ బోల్తా.. ట్రాఫిక్‌కు అంతరాయం


హైవేపై బోల్తాపడిన టిప్పర్

మునగాల: సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్తున్న టిప్పర్ మంగళవారం రాత్రి విజయవాడ–హైదరాబాద్ హైవేపై మునగాల మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రి ఎదురుగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనతో అర్ధగంట ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మునగాల ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. టిప్పర్‌ను రోడ్డు పక్కకు తొలగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

భూ ఆక్రమణకు యత్నించిన భార్యాభర్తలపై కేసు

- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: భూ వివాదం పెండింగ్‌లో ఉండగానే ఈ నెల 16న భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. మంగళవారం నల్లగొండ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కగనల్ మండలం జి.చెన్నారం గ్రామంలోని ఓ భూమి మీదకు ఈ నెల 16న గార్లపాటి భూపాల్‌రెడ్డి, అతని భార్య రామేశ్వరమ్మ.. కందిమల్ల రఘుమారెడ్డి, జమ్మల్ల ప్రభాకర్ రెడ్డి సాయంతో భూమిని ఆక్రమించుకునేందుకు డోజర్ వాహనంతో వచ్చారు. విషయం తెలుసుకున్న కూకుంట్ల శేఖర్ తనకు పూర్తి డబ్బులు ఇవ్వకుండానే భూమి వద్దకు వెళ్లొద్దంటూ అడ్డుకోబోయాడు. దీంతో శేఖర్‌ను కూలం పేరుతో దూషించడంతో చంపి అక్కడే పాతి పెడతామని బెదిరించి దాడి చేసి భూమి నుంచి బయటకు తోసివేశారు. ఈ ఘటనపై కనగల్ పోలీస్ స్టేషన్‌లో శేఖర్ ఈ నెల 16న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గార్లపాటి భూపాల్‌రెడ్డి, గార్లపాటి రామేశ్వరమ్మను కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ భూ వివాదం కేసులో భూపాల్‌రెడ్డి, రామేశ్వరమ్మ ఈ నెల 12న నల్లగొండలో ప్రెస్‌మీట్ పెట్టి పోలీసులు సహకరించడం లేదని, డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ విషయంపై కనగల్ పోలీసులపై శాఖాపరమైన విచారణ జరపగా.. తప్పుడు, నిరాధార ఆరోపణలని తేలిందన్నారు. భూమిని ఆక్రమించడానికి సహకరించనందుకు పోలీసులను ఇరుకున పెట్టే ఉద్దేశంతోనే వారు ఆరోపణలు చేసినట్లు తేలిందని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా భూ వివాదాలకు సంబంధించి కబ్జాలో ఉన్న వారితో నేరుగా గాకుండా కోర్టు, రెవెన్యూ శాఖ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. చట్ట విరుద్ధంగా కబ్జాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఫ్లైఓవర్ పైనుంచి పడిన బైక్

- యువకుడి మృతి

నకిరేకల్ : బైక్ అదుపుతప్పి జాతీయ రహదారి ఫ్లైఓవర్ పైనుంచి కిందపడడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన 365వ నంబర్ జాతీయ రహదారిపై నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దఉంగర మండలం కోరిపల్లికి చెందిన అలీసాల్ ప్రదీప్(32) తన తల్లి వసంతతో కలిసి సికింద్రాబాద్‌లోని మహ్మద్‌గూడలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నాడు. ప్రదీప్ తండ్రి గతంలోనే మృతిచెందాడు. ప్రదీప్ తల్లి వసంత కూలీ పనిచేస్తుండగా.. ప్రదీప్ బట్టల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజుమాదరిగానే సోమవారం కూడా ప్రదీప్ తల్లి వసంత కూలీ పనికి వెళ్లింది. బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరిన ప్రదీప్ సోమవారం అర్ధరాత్రి 365వ నంబర్ హైవేపై నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో గల ఫ్లైఓవర్ పైనుంచి అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రదీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం స్థానిక కూలీలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సామ సుధాకర్ రెడ్డి (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఇంటి వద్ద సింగిల్ ఫేజ్ మోటారుకు రిపేర్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పోసానికుంటలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పోసానికుంట గ్రామానికి చెందిన సామ సుధాకర్‌రెడ్డి(45) మంగళవారం ఉదయం తన ఇంటి వద్ద సింగిల్ ఫేజ్ మోటారును రిపేరు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్


చివ్వెంల: పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు నిందితులు

చివ్వెంల(సూర్యాపేట): భూ వివాదాల కారణంగా వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వి. మహేశ్వర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భూ వివాదాల కారణంగా చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామానికి చెందిన గుండెబోయిన గంగయ్యపై అదే గ్రామానికి చెందిన గుండెబోయిన సైదులు, గుండెబోయిన పెద్దగంగయ్య, గుండెబోయిన శ్రీలత ఈ నెల 15వ తేదీన గొడ్డలి, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో గంగయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తికి..

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండలం కప్రాయిపల్లికి చెందిన సుంకరి రవికుమార్‌పై కత్తితో దాడి చేసిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 15న సుంకరి రవికుమార్ బర్రె పాలు పితికొని బైక్‌పై ఇంటికి వస్తుండగా.. పాతకక్షలను మనుసులో పెట్టుకొన్న ఎర్రబోతు మహేశ్, ఎర్రబోతు శ్యామ్‌బాబు, ఎర్రబోతు మధు, నర్సింహ అతడిని అడ్డగించి కత్తితో కడుపులో పొడిచి తలపై దాడి చేశారు. ఈ ఘటనలో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా రవికుమార్‌ను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఎర్రబోతు మహేశ్‌ను చౌటుప్పల్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ చోరీ చేసిన దొంగ అరెస్ట్

ఆలేరురూరల్: ట్రాక్టర్‌ను అపహరించిన దొంగను సీసీ కెమెరాల ఆధారంగా మంగళవారం ఆలేరు పోలీసులు పట్టుకున్నారు. సీఐ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామానికి చెందిన నుంగునూరి వేణు తన వ్యవసాయ బావి వద్ద పార్కింగ్ చేసిన ట్రాక్టర్‌ను ఈ నెల 10వ తేదీ రాత్రి పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ముప్పడి రమేష్ అపహరించాడు. మరుసటిరోజు ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా ట్రాక్టర్ కనిపించకపోవడంతో వేణు ఆలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా.. ట్రాక్టర్‌తో దొంగ పెద్దపల్లి వైపు వెళ్లినట్లు గుర్తించారు. మంగళవారం ఉదయం జీడికల్ ఎక్స్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. దొంగిలించిన ట్రాక్టర్‌పై హైదరాబాద్ వైపు వస్తున్న ముప్పడి రమేష్‌ను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

హాలియా : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన అనుముల మండలం చల్లారెడ్డిగూడెంలో సోమవారం అర్ధరాత్రి జజరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గాలిమెట్టి ఎల్ల మ్మ సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో వస్తువులు, సామగ్రికి మంటలు అంటుకున్నాయి. మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఈ ప్రమాదంలో కిటికీలు, తలుపులు, ఫ్రిడ్జ్, కూలర్, ఎల్ఈడీ టీవీ, రూ.10 వేల నగదు కాలిపోయినట్లు బాధితురాలు పేర్కొంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆమె వేడుకుంటోంది.

ఒక ట్రాక్టర్.. మూడు గుంటుకలు



ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేటలో రైతు సూదగాని లింగయ్యగౌడ్ పత్తి చేనులో ట్రాక్టర్‌కు మూడు గుంటుకలు కట్టి తోలుతున్నాడు. దీంతో సమయం ఆదాతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని చెబుతున్నాడు.

– ఆత్మకూరు (ఎం)

మత్స్య పరిశ్రమకు పెరుగుతున్న ఆదరణ

- ఏఎమ్మార్పీ ఆయకట్టులో విరివిగా చేపల చెరువులు
- ఆధునిక సాంకేతికతను జోడించి చేపల పెంపకం



గుర్రంపోడు: వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఒకటైన చేపల పెంపకంపై ఆదరణ పెరుగుతోంది. సాగునీటి వసతి పుష్కలంగా ఉండి పంటలకు అనువైన భూములు లేని చోట్ల ఆసక్తి ఉన్న రైతులు చేపల చెరువులను తవ్వుకుని చేపల పెంపకం చేపడతూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. గుర్రంపోడు మండలంలో సుమారు వంద ఎకరాల్లో చెరువులను ఏర్పాటు చేసుకుని చేపలను పెంచుతున్నారు. ప్రధానంగా పంటలకు అనువుగా లేని చౌడు భూముల్లో, వాగు నీటి వంపుల్లో చేపల చెరువులు ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. మత్స్యశాఖతో పాటు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా అందుతున్న సబ్సిడీ అందిస్తుండడంతో ఏటా చేపల పెంపకం చేపడుతున్న రైతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.


వెంకటాపురంలోని చేపల చెరువు

కోనసీమను తలపించేలా..

ఐదెకరాలు, పదెకరాల వరకు చేపల చెరువులను తవ్వుకుని చేపల చెరువులను ఏర్పాటు చేసుకున్న చోట్ల కోనసీమను తలపించే వాతావరణం కనిపిస్తుంది. గుర్రంపోడు మండలంలోని వెంకటాపురం(కె) గ్రామంలో రామగిరి వెంకటరమణారావు అనే రైతు తనకు 20 ఎకరాల్లో, ఆములూరు గ్రామానికి లక్ష్మయ్య సుమారు 30 ఎకరాల్లో చేపల చెరువులను ఏర్పాటు చేసుకుని చేపలను పెంచుతున్నారు. కొయగూరవానిబావి, తేనపల్లి, గుర్రంపోడు, చేపూరు తదితర గ్రామాల్లో చేపల చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో బొచ్చ, రవ్వ, రూప్‌చంద్, కొర్రమేను తదితర రకాల చేపలను పెంచుతున్నారు.


సొంతంగా దాణా తయారీ..

చేపల దాణా అవసరమైన ముడిసరుకులను రైతులే స్వయంగా తెచ్చుకుని చైనాతో పాటు ఢిల్లీ, రాజస్తాన్ ప్రాంతాల నుంచి యంత్రాలను దిగుమతి చేసుకుని పెద్ద షెడ్డు ఏర్పాటు చేసుకుని దాణా తయారు చేసుకుంటున్నారు.

స్త్రీశక్తికి తగిన గుర్తింపు

ఆక్వా రంగం (చేపల పెంపకం)లో మహిళలను ప్రోత్సహించేలా రాష్ట్రం నుంచి ఆరుగురు మహిళలను ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకలకు పంపించగా.. అందులో నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన వంపు స్వాతి కూడా ఉన్నారు. నిరుపేద దళిత మహిళ అయిన స్వాతి తన భర్త సహకారంతో సాగుకు యోగ్యం కాని తన మూడెకరాల భూమిలో చిన్న చెరువులను ఏర్పాటు చేసుకుని చేపల పెంపకం చేపట్టి విజయవతంగా ముందుకు సాగుతోంది. తొలుత చేపలను పెంచాలనే ఆసక్తితో తనకున్న వంపు భూమిలో నీరు నిలిచే గుంతలో కొర్రమీనలు సాగు చేసుకోగా అదే వృత్తిగా మరింతగా విస్తరించారు.

ప్రోత్సాహం అందించాలి



ప్రభుత్వం చేపల పెంపకందారులను ప్రోత్సహించేలా రాయితీలు అందించాలి. చెరువులు ఏర్పాటు చేసుకున్న వారందరికీ రాయితీలు రావడం లేదు. దాణాపై పన్నులు తగ్గించి తక్కువ ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలి. చేపలు వ్యాధుల బారిన పడకుంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

– వేముల లక్ష్మయ్య, మత్స్యకార్మికుడు